సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం ׀ 20 ׀ మార్చి ׀ 2025

I



స్ఫూర్తిదాయకం నీ ఘనత

భారతీయ సంతతికి చెందిన సునీత విలియమ్స్ వ్యోమగామిగా సాధించిన విజయాలు యువతకు ఆదర్శం.

- IIలో



బిల్లు ఆమోదంపై సంబరాలు

అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వ ర్యంలో సంబరాలు నిర్వహించారు.

- IIIలో



న్యూస్‌రీల్

ఏడుగురు డిప్యూటీ తహసీల్దార్లకు పోస్టింగ్

భువనగిరి టౌన్ : జిల్లాలో ఏడుగురు డిప్యూటీ తహసీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ హను మంతరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎండీ సిరాజుద్దీన్‌ను జిల్లా సరఫరాల శాఖ డీటీగా నియమించి భువనగిరి ఆర్డీఓ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై పంపారు. పున్న శివకుమార్‌ను కలెక్టరేట్‌లో, దున్న లింగ స్వామిని బొమ్మలరామారం, ఎం.ఉపేందర్ మోత్కూరు, జనగాం శైలజను రామన్నపేట డీటీలుగా బదిలీ చేశారు. అదే విధంగా ఉయ్యాల కవితను ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (లోకల్‌బాడీలో) యూనిట్ 2కు, శివగణేష్‌ను ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్(లోకల్‌బాడీ) యూనిట్ 1కు కేటాయించారు.

పీఓడబ్ల్యూ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



పీఓడబ్ల్యూ నూతన కమిటీ సభ్యులు

ఆలేరు రూరల్: ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) జిల్లా నూతన కమిటీని బుధవారం ఆలేరులోని సీపీఐఎంఎల్ ఎన్‌డీఆర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పంగ వరలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా కొత్తపేట విజయ, కార్యదర్శిగా కోలా అనిత, సహాయ కార్యదర్శి పంగ సరిత, కోశాధికారిగా వస్పరి స్వరూప, కార్యవర్గ సభ్యులుగా గట్టికొప్పుల అంజమ్మ, మదూరి లక్ష్మి, జన్నె లక్ష్మిని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ పంగ వరలక్ష్మి, రాష్ట్ర నాయకురాలు జంగిటి సుభాషిణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పి.జయ, ఆర్.బాలమ్మ, పద్మ, కె.జ్యోతి, స్రవంతి, అనూసూర్య, భాగ్య పాల్గొన్నారు.

మోత్కూరు తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి సమస్య వివరిస్తున్న బాధిత రైతులు

భువనగిరి, మోత్కూర్: తమ భూములను అక్రమంగా ఇతరులకు పట్టా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ మోత్కూరు తహసీల్దార్ రాంప్రసాద్‌పై పలువురు రైతులు బుధవారం కలెక్టర్ హనుమంతరావుకు ఫిర్యాదు చేశారు. 15 మంది రైతులు మోత్కూరు పట్టణంలో 38 గుంటల భూమి కొనుగోలు చేశారు. పక్కనే ఉన్న మరో వ్యక్తి భూమికి సంబంధించి కూడా అదే సర్వే నంబర్ కావడంతో కొంతకాలంగా వివాదం నెలకొంది. కాగా డబ్బులు ఆశించి 38 గంటలు సదరు వ్యక్తికి పట్టా చేసే ప్రయత్నం చేస్తున్నారని, తహసీల్దార్ తమకు నోటీసులు కూడా జారీ చేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రక్రియ నిలిపివేయాలంటూ తహసీల్దార్‌ను ఆదేశించారు. అంతకుముందు బాధితులు తమకు న్యాయం చేయాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సుధగాని ముత్యాలు, అవిశెట్టి బాలరాములు, లొడంగి లక్ష్మి, పెండం భారతమ్మ, జోగు రామచంద్రయ్య, దునక ప్రభాకర్, హజారి చంద్రరావు, ముక్కలమల అంజమ్మ, కాపుగంటి ధనలక్ష్మి, కొండయ్య, అవిలిమల్లు పాల్గొన్నారు.

నేడు సూర్యాపేటకు కేటీఆర్ రాక

సూర్యాపేట టౌన్: వరంగల్‌లో ఏప్రిల్ 27న జరగనున్న బీఆర్‌ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ బహిరంగ సభ విజయవంతానికై గురువారం సూర్యాపేటలో ఆ పార్టీ జిల్లా ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఇందుకోసం సూర్యాపేటలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ సమావేశంలో బహిరంగ సభ విజయవంతంతోపాటు జిల్లాలో సాగు, తాగునీటి సమస్యపై చర్చించనున్నట్లు జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య నేతలంతా విధిగా హాజరు కావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టూటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుతో చేనేత కార్మికులకు ఇవ్వనున్న అవార్డులకు అర్హత కలిగిన వారు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత జౌళి శాఖ ఏడీ ద్వారక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత డిజైన్ వృత్తిలో పనిచేస్తున్న వారికి అవార్డు ఇస్తారని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.10 వేల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేస్తారని తెలిపారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు



భువనగిరిలో పరీక్ష ముగిసిన అనంతరం విద్యార్థుల ఆనంద హేల

- చివరి రోజు 6,035 మంది హాజరు

భువనగిరి: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతమైన వాతావరణంలో ముగిశాయి. చివరి రోజు జరిగిన కెమిస్ట్రీ, వాణిజ్య శాస్త్రం పరీక్షలకు 6,395 మంది విద్యార్థులకు గాను 6,035 మంది హాజరయ్యారు. 360 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ రమణి తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా కనిపించారు. హాస్టళ్లు, అద్దె ఇళ్లలో ఉంటున్న విద్యార్థులు స్వగ్రామాలకు వెళ్లిపోయారు. దీంతో భువనగిరి ఆర్టీసీ బస్టాండ్ రద్దీగా కనిపించింది. ద్వితీయ సంవత్సర పరీక్షలు సైతం గురువారం ముగియనున్నాయి.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సంప్రదాయ పూజలు ఆగమ శాస్త్రం ప్రకారం కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో శ్రీస్వామివారిని మేల్కొలిపారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు అభిషేకం, అర్చన చేశారు. ఇక ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయద్వారబంధనం చేశారు.



ఉత్సవమూర్తులకు పూజలు చేసి హారతినిస్తున్న అర్చకుడు

నీళ్లకు నిధులు

- అన్నదాతల్లో ఆనందం
- ఇండస్ట్రియల్ కారిడార్‌పై చిగురిస్తున్న ఆశలు
- సంక్షేమానికీ పెద్దపీట
- ఇందిరమ్మ ఇళ్ల పథకంతో తొలి విడతలో 10 వేల మందికి లబ్ధి
- 'రేషన్' దరఖాస్తులకు ఇక మోక్షం
- రాజీవ్ యువ వికాసంతో యువతకు ప్రయోజనం

రాష్ట్ర బడ్జెట్‌లో మూసీ కాలువలకు ప్రాధాన్యం

రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో జిల్లాలోని వివిధ వర్గాలకు ప్రయోజనం చేకూరనుంది. మూసీ కాలువలకు నిధులు కేటాయించడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రతిపాదనలకే పరిమితమైన హైదరాబాద్ - వరంగల్ హైవే ఇండస్ట్రియల్ కారిడార్‌పై ఆశలు చిగురిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న రేషన్‌కార్డులకు మోక్షం లభించనుంది. వీటితో పాటు సంక్షేమ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పెద్ద సంఖ్యలో లబ్ధిపొందనున్నారు. అయితే యంగ్ ఇండియా ప్రాజెక్టు, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం ప్రస్తావన లేకపోవడం ఆయా వర్గాలను నిరాశపరిచింది.

-సాక్షి,యాదాద్రి



అసంపూర్తిగా బునాదిగాని కాలువ

మూడు కాల్వలకు కేటాయింపులు

బడ్జెట్‌లో జిల్లాలోని మూసీ ఆధారిత కాలువలకు ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. కాలువ ఆధునీకరణకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. ఇందులో బునాదిగాని కాలువకు రూ.266.65 కోట్ల పాలనామోదం ఇచ్చారు. అలాగే పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాలువల పునరుద్ధరణకు నిధులివ్వాలని నిర్ణయించారు. నల్లగొండ జిల్లాలోని బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టునుంచి యాదాద్రి భువనగిరిలోని కొన్ని గ్రామాలకు తాగు, సాగు నీరు ఇవ్వనున్నారు. బస్వాపూర్, గంధమల్ల ప్రాజెక్టులకు నిధులపై స్పష్టత రావాల్సి ఉంది.

కారిడార్‌తో ఉపాధి



వరంగల్ - హైదరాబాద్ జాతీయ రహదారి వెంట పారిశ్రామిక కారిడార్ (జాతీయ రహదారి 163) ఏర్పాటు చేయాలని ఎప్పటినుంచో ప్రతిపాదన ఉంది. కారిడార్ వెంట పరిశ్రమల ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఈ ప్రాజెక్టులపై ఆశలు చిగురిస్తున్నాయి. అందుబాటులోకి వస్తే జిల్లాలోని బీబీనగర్, భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు మండలాల్లో పరిశ్రమలు రానున్నాయి. తద్వారా ఉపాధి అవకాశాలు, జీవనోపాధి పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధికి హామీ



టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ (వైటీడీ)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తామని బడ్జెట్‌లో భట్టి విక్రమార్క ప్రస్తావించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆలయ విమానగోపురానికి 65 కిలోల బంగారంతో తాపడం పనులు చేయించామని వెల్లడించారు.

తొలుత నాలుగు లేన్లుగా 'రీజనల్'

ఎనిమిది లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవేగా ప్రతిపాదించిన రీజినల్ రింగ్ రోడ్డును తొలుత నాలుగు లేన్లలో నిర్మించనున్నారు. ఉత్తరభాగంలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న జాతీయ రహదారుల నెట్‌వర్క్ లోటును పూడుతుందని భట్టి విక్రమార్క ప్రకటించారు.

ఇందిరమ్మ ఇళ్లకు గ్రీన్‌సిగ్నల్

ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాలకు కలిపి సుమారు 10 వేల మంది నిరుపేదలకు ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉంది.

పర్యాటకానికి చేయూత

యాదగిరిగుట్ట, భువనగిరి, కొలనుపాక, బస్వాపూర్, మహదేవ్‌పూర్ ప్రాంతాలను టూరిజం శాఖ ప్రత్యేక పర్యాటక కేంద్రాలు గుర్తించింది. వీటితో పాటు రీజినల్‌రింగ్ రోడ్డు వెంట పర్యాటకుల కోసం వసతులు కల్పించనున్నారు. చారిత్రక, ఆధ్యాత్మిక ఎకో టూరిజం కోసం నిధులు కేటాయించారు.



అందనున్న రేషన్‌కార్డులు

ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రేషన్‌కార్డులను త్వరలో జారీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కొత్త రేషన్‌కార్డుల మంజూరు, కొత్త సభ్యుల పేర్లు నమోదుతోపాటు ఉగాది నుంచి సన్నబియ్యం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. 428 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో 64,238 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే వీరిలో 20 వేల మందిని అర్హులుగా గుర్తించారు. మిగతా దరఖాస్తుల విచారణ కొనసాగుతోంది.

యువతకు వికాసం



రాజీవ్ యువ వికాసం పేరుతో నిరుద్యోగ యువతకు ఉపాధి లభించనుంది. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన యువతకు ప్రభుత్వం రూ.50 వేల నుంచి గరిష్టంగా రూ.4 లక్షల వరకు ఆయా కార్పొరేషన్ల నుంచి ఆర్థిక సాయం చేయనుంది.

మహిళలకు ఆర్థిక స్వావలంబన



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు జిల్లాలో ప్రారంభించారు. స్వయం సహాయ సంఘాల ఆదాయం పెంచడం కసం ఆర్థిక సహాయం చేస్తున్నారు. ప్రధానంగా ప్రతి మండలంలో రైస్‌మిల్లు, గోదాం నిర్మాణం కోసం ఆర్థిక సహాయం చేయనున్నారు. రుణ బీమా పథకం కింద స్వయం సహాయక సంఘం సభ్యురాలికి సహజ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాద బీమా మరణం సంభవిస్తే రూ.10 లక్షల ఆర్థిక రక్షణ కల్పించనున్నారు.

నేతన్నకు భరోసా



చేనేత, మరమగ్గాల కార్మికులు అధికంగా ఉన్న జిల్లాలో ప్రభుత్వం పథకాలతో లబ్ధి చేకూరనుంది. తెలంగాణ నేతన్న పొదుపు,(పొదుపు నిధి), తెలంగాణ నేతన్న భద్రత (నేతన్న బీమా),తెలంగాణ నేతన్నకు భరోసా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది.

ఆమోదయోగ్యమైన బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలకు దాదాపు రూ.56వేల కోట్లకు పైగా నిధులు వెచించారు. మూసీ కాలువలకు ప్రాధాన్యం ఇచ్చారు. బునాదిగాని కాలువకు రూ.266 కోట్ల పాలనామోదం కూడా లభించింది. నిరుద్యోగ యువతకు యువ వికాసం పథకం వరంగా మారనుంది. పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అలాగే మూసీ పునరుజ్జీవానికి రూ.17వేల కోట్లు కేటాయించడం హర్షణీయం.

-కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, భువనగిరి

అంతా అంకెల గారడీ



బడ్జెట్ అంకెల గారిడీగా ఉంది. గత ఏడాది వ్యవసాయ రంగానికి రూ 49 వేల కోట్లు కేటాయించగా, ఈసారి రూ.24,439 కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారు. ఇంత తక్కువ బడ్జెట్‌తో వ్యవసాయ రంగానికి ఏ విధంగా మేలు జరుగుతుంది. 50లక్షల కుటుంబాలకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా 25 లక్షలకు మించడం లేదు. సబ్సిడీ గ్యాస్ సగం కుటుంబాలకే అందుతుంది. రైతుభరోసా విషయంలో రైతులను మోసం చేశారు. ఆరు గ్యారంటీలు అటకెక్కాయి.

-అశోక్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

జిల్లాకు అరకొర నిధులే..



జిల్లాకు అరకొరగా నిధులు కేటాయించారు. బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్లతో పాటు మూసీ ప్రక్షాళనకు సమగ్రమైన నిధుల కేటాయింపు లేదు. మూసీ కాలువలకు నిధులు కేటాయించడం ఊరట కలిగించింది. భువనగిరిలో డిగ్రీ, పీజీ కళాశాలలు, చౌటుప్పల్ ప్రాంతంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు ప్రస్తావనే లేదు.

-ఎండీ జహంగీర్, సీపీఎం జిల్లా కార్యదర్శి

మరోసారి మోసం చేశారు



రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేసింది. ఆరు గ్యారంటీలకు సరైన కేటాయింపులు జరగలేదు. తులం బంగారం విషయంపై స్పష్టత ఇవ్వలేదు. రైతుభరోసా నిధులు కేటాయింపులు జరగలేదు. బలహీనవర్గాలకు ఏటా రూ.20వేల కోట్లు కేటాయింపులు చేయాల్సి ఉండగా కేవలం రూ.10 వేల కోట్లు కేటాయించి చేతులు చేతులు దులుపుకుంది. బడ్జెట్ అంకెల గారడీగా ఉంది. దీన్ని బీఆర్‌ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుంది.

-భిక్షమయ్యగౌడ్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే

భూసేకరణలో వేగం పెంచండి



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు, పక్కన అదనపు కలెక్టర్ వీరారెడ్డి

- కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లు, పిలాయిపల్లి కాలువతో పాటు రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలసి సర్వే ల్యాండ్ రికార్డ్స్, సర్వేయర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి భూ సేకరణపై సమీక్షించారు. భూ సేకరణ జాప్యం కాకుండా చూడాలన్నారు. సర్వే ల్యాండ్ కింద పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి జగన్నాథరావు, నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం ఎస్సీ హాస్టల్‌లో కలెక్టర్ రాత్రి బస



హాస్టల్‌లో నిద్రిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

సంస్థాన్ నారాయణపురం : నెలలో ఒక రోజు నిర్వహిస్తున్న హాస్టల్ బస కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ హనుమంతరావు బుధవారం రాత్రి సంస్థాన్‌నారాయణపురంలోని ఎస్సీ హాస్టల్‌లో నిద్రించారు. పదో తరగతి విద్యార్థులతో పరీక్షలకు ఎలా సన్నద్ధం అవుతున్నారని ప్రశ్నించారు. ఒత్తిడి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, నిర్దేశిత సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థికి పదో తరగతి మైలు రాయి అని, ఉత్తీర్ణులైతే విజయానికి తొలి మెట్టు అవుతుందన్నారు. మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు, గురువులకు, జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. అంతకుముందు విద్యార్థులకు వండిన భోజనాన్ని రుచి చూశారు. అదే విధంగా వంట గది, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని వార్డెన్‌కు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాలు
- హాజరుకానున్న 8,632 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- క్యూ ఆర్ కోడ్‌తో ప్రశ్న పత్రాలు



భువనగిరి : పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాల్లో 8,632 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరితో పాటు 188 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరగనుంది.

క్యూ ఆర్ కోడ్‌తో బుక్‌లెట్

క్యూఆర్ కోడ్‌తో ముద్రించిన 24 పేజీలతో సన్నని లైన్లతో కూడిన బుక్‌లెట్ ఇవ్వనున్నారు. గతంలో వైట్ పేపర్లు ఇవ్వడం వల్ల సమాధానాలు రాయడంలో గందరగోళం నెలకొనేది. కొందరు క్రాస్‌గా రాసేవారు. దీంతో పాటు అదనపు పేపర్లు తీసుకున్న వారు సీరియల్ ప్రకారం లేకుండా దారం కట్టేవారు.దీని వల్ల పేపర్ మూల్యాంకనం చేసే క్రమంలో ఇబ్బందులు ఎదరై మార్కులు తక్కువగా వచ్చేవి. ఇటువంటి సమస్యలను అధిగమించేందుకు లైన్లతో కూడిన బుక్‌లెట్ ఇవ్వనున్నారు. అలాగే ప్రశ్న పత్రంపై క్యూ ఆర్‌కోడ్‌తో పాటు సీరియల్ నంబర్ ప్రతి పేజీపై ముద్రిస్తారు.

ఈ సారి ఏడు పరీక్షలు

గతంలో పదో తరగతి విద్యార్థులకు 11పేపర్లు ఉండేవి. ఈ సంవత్సరం నుంచి ఏడు పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఫిజికల్స్ సైన్స్, బయాలజీ పేపర్లను వేర్వేరు రోజుల్లో నిర్వహించనున్నారు. ఈ రెండు పరీక్షలు ఒక్కో పేపర్ గంటన్నర వ్యవధిలో రాయాల్సి ఉంటుంది. ఒక్కోటి 40 మార్కుల చొప్పున 80 మార్కులకు పరీక్ష రాయాలి. మరో 20 మార్కులు ఇంటర్నల్ మార్కుల నుంచి తీసుకుంటారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

పరీక్షలు సజావుగా జరిగేలా, మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. సమస్యలు ఉంటే తెలియజేయడానికి, సందేహాలు నివృత్తి చేసుకోవడానికి కంట్రోల్ రూం నంబర్ 9010772080 అందుబాటులో ఉండనుంది. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు 50, డిపార్టమెంటల్ ఆఫీసర్లు 50, ఇన్విజిలేటర్లు 556, ఫ్లయింగ్ స్క్వాడ్ 3 టీంలను ఏర్పాట్లు చేశారు. డీఈఓ సత్యనారాయణ బుధవారం ఎంఈవోలు, సీఎస్, డీఓలతో జూమ్ మీటింగ్ నిర్వహించి పరీక్షల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు.

గంట ముందే చేరుకోవాలి



విద్యార్థులకు నిర్దేశిత సమయానికి గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఐదు నిమిషాలు గ్రేస్ పీరియడ్ అవకాశం కల్పించారు. స్మార్ట్ వాచ్, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు కేంద్రంలోకి అనుమతి లేదు. ఒత్తిడికి లోనవకుండా విద్యార్థులకు పరీక్ష రాయలి. స్కూల్ యూనిఫాం ధరించి పరీక్షలకు హాజరు కావద్దు.

-సత్యనారాయణ, డీఈఓ

ఆహారభద్రత నియమాలు తప్పనిసరి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరిటౌన్ : వ్యాపారులు తప్పనిసరిగా ఆహార భద్రత నియమాలు పాటించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. తూకాలు, నాణ్యత విషయంలో కొనుగోలుదారులను వ్యాపారులు మోసం చేస్తున్న తీరుపై 'కొనేదాంట్లో-- కొట్టేస్తున్నారు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపార సముదాయాల్లో ఆహార భద్రతా నియమాలు అమలయ్యే చర్యలు తీసుకోవాలని సూచించారు. హోటళ్లు, బేకరీలు, స్వీట్ హౌజ్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లతో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసే భోజనం విషయంలో నాణ్యత ఉండాలని, అందుకోసం తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. లైసెన్స్ పొందిన పొందిన ఆహార పదార్థాలనే ప్రజలకు విక్రయించేలా చూడాలన్నారు.

ఫుడ్ అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు

అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధ్యక్షతన అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, డీఎంహెచ్‌ఓ మనోహర్, జిల్లా అధికారులతో కలిసి జిల్లాస్థాయి ఫుడ్ సేఫ్టీ అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి, డాక్టర్ సుమన్ కళ్యాణ్, బీసీ వెల్ఫేర్ అధికారి యాదయ్య, వ్యవసాయ అధికారి గోపాల్, డిప్యూటీ సివిల్ సప్లై అధికారులు రోజా రాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

క్లుప్తంగా

బస్సు ఆపలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

చిట్యాల: చెప్పిన చోట బస్సు ఆపలేదని ప్రయాణికుడు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేశాడు. ఈ ఘటన చిట్యాలలో బుధవారం రాత్రి జరిగింది. నల్లగొండ ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్డినరీ బస్సు భువనగిరి నుంచి నల్లగొండకు వెళ్తోంది. ఇద్దరు ప్రయాణికులు చిట్యాలకు వెళ్లేందుకు గాను రామన్నపేటలో బస్సు ఎక్కారు. వారు రామన్నపేట–చిట్యాల మధ్యలో బస్సు నిలపాలని డ్రైవర్‌ను కోరారు. చిట్యాలకు వెళ్లేందుకు ఎక్కిన ప్రయాణికులు మధ్యలో బస్సు ఆపమనడంతో డ్రైవర్ శ్రీనివాస్ బస్సు ఆపలేదు. దీంతో బస్సు చిట్యాలకు వచ్చిన తర్వాత ఆ ఇద్దరు ప్రయాణికులు డ్రైవర్‌పై దాడి చేశారు. డ్రైవర్ శ్రీనివాస్ చిట్యాల పోలీస్ స్టేషన్ వద్ద బస్సు నిలిపి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం నిలిపివేసిన బస్సులోని ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించి పంపివేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో జరిగింది. బుధవారం మిర్యాలగూడ టూటౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో నివాసముంటున్న ముడావత్ నాగు(35)కు, అతడి భార్య ప్రియ మధ్య మనస్పర్థలు రావడంతో కొద్దిరోజులుగా వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి 9:30 గంటల సమయంలో ప్రియ తన కుమార్తెను ట్యూషన్ నుంచి తీసుకురావడానికి వెళ్లగా.. ఇంట్లోనే ఉన్న నాగు లోపలి నుంచి గడియ పెట్టుకుని చీరతో ఉరేసుకున్నాడు. ట్యూషన్ నుంచి కుమార్తెను తీసుకుని ఇంటికి వచ్చిన ప్రియ నాగు ఉరికి వేలాడుతుండటం గమనించి ఇంటి పక్కన వారిని పిలిచి తలుపులు పగులకొట్టి అంబులెన్స్‌లో మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే నాగు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న నాగు తల్లిదండ్రులు ఆస్పత్రికి వచ్చి తమ కుమారుడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. కోడలు ప్రియ, ఆమె అక్క విజయ, బావ సైదాపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి తండ్రి పంతులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జున తెలిపారు.

జామాయిల్ తోట దగ్ధం

రాజాపేట: మండలంలోని బొందుగుల గ్రామంలో బుధవారం రైతు బొందుగుల వెంకట్‌రెడ్డికి చెందిన జామాయిల్ తోట ప్రమాదవశాత్తు దగ్ధమైంది. చుట్టుపక్కల రైతులు గమనించి అగ్నిమాపక సిబ్బంది సమాచారం ఇవ్వగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. 40 ఎకరాల జామాయిల్ తోటలో సుమారు 30 ఎకరాలు దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఎదుర్కోళ్ల మహోత్సవం అనంతరం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ తలంబ్రాలు వైభవంగా జరిపించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో వన్యప్రాణుల రక్షణకు చర్యలు



అటవీ ప్రాంతంలోని నీటితొట్ల వద్ద నెమళ్లు



నీళ్లు తాగుతున్న అడవి జంతువులు

- నాగార్జునసాగర్ అటవీ ప్రాంతంలో సాసర్ పిట్‌లలో నీటిని నింపుతున్న ఫారెస్ట్ అధికారులు
- సీసీ కెమెరాలతో జంతువులు, పక్షుల కదలికలు నమోదు

నాగార్జునసాగర్: వేసవిలో తాగునీటికై వణ్యప్రాణులు మైదాన ప్రాంతాలకు వస్తున్న నేపథ్యంలో వాటి రక్షణకు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని నాగార్జునసాగర్ డివిజన్ అటవీ అధికారులు పలు చర్యలు చేపట్టారు. గత ఆరునెలలుగా వర్షాలు లేక అటవీ ప్రాంతంలోని వాగులు, వంకలు, నీటి జాలు గుంతలన్నీ వట్టిపోయాయి. దీంతో అడవి జంతువులకు తాగునీరు దొరకడం కష్టంగా మారింది. వాటి దాహాన్ని తీర్చేందుకు అటవీ ప్రాంతంలో గతంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన సాసర్ పిట్‌లలో(నీటి తొట్లు) అటవీ శాఖ అధికారులు నీటిని నింపుతున్నారు. నెల్లికల్లు ఫారెస్ట్‌లోనే 25 సాసర్ పిట్‌లు ఏర్పాటు చేశారు. ఆ తొట్లలో వాతావరణాన్ని బట్టి 15రోజులకోమారు ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. ఆ నీటితోనే జంతువులు, పక్షులు దాహార్తిని తీర్చుకుంటున్నాయి. నీటి తొట్ల పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను కూడా అమర్చారు. నీరు తాగేందుకు వచ్చే పక్షులు, జంతువుల చిత్రాలు కెమెరాల్లో నమోదవుతున్నాయి. ఆ కెమెరాల నుంచి ఫొటోలను డంప్ చేసుకుని వాటి బాగోగులను, ఆరోగ్య పరిస్థితులను అంచనా వేస్తున్నారు. జంతు గణనకు కూడా ఇది తోడ్పడే అవకాశం ఉంది. అంతేకాకుండా అడవిలో మనుబోతులు, ఎలుగుబంట్లు, నెమళ్లు, నక్కలు, కుక్కలు, దుప్పులు తదితర జంతువులు అత్యధిక సంఖ్యలో ఉండగా.. అవి వేటగాళ్ల ఉచ్చులు, వలలకు చిక్కకుండా వాచర్లు కాపాడుతున్నారు.

సాసర్ పిట్‌లలో నీటిని నింపుతున్నాం



వేసవిలోఅడవి జంతువుల సంరక్షణకు గాను సాసర్ పిట్‌లలో నీటిని నింపుతున్నాం. అంతే కాకుండా వేసవిలో అగ్ని ప్రమాదాలు జరుగకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నాం. అటవీ శివారు గ్రామాల్లో బేస్ క్యాంప్ హెల్పర్లు 24గంటలు కాపలాగా ఉంటారు. స్వచ్ఛంద సంస్థలు సైతం అడవుల సంరక్షణ బాధ్యతను తీసుకోవాలి.

– రాఘవేందర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, నాగార్జునసాగర్

నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం

- మల్టీ జోన్–2 ఐజీ సత్యనారాయణ
- హత్యకు గురైన చక్రయ్యగౌడ్ కుటుంబ సభ్యుల నుంచి వివరాల సేకరణ



చక్రయ్యగౌడ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ, ఎస్పీ

నూతనకల్: నూతనకల్ మండలం మిర్యాల గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మెంచు చక్రయ్యగౌడ్ హత్యకు కారకులైన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని మల్టీ జోన్–2 ఐజీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన మిర్యాల గ్రామాన్ని సందర్శించి మృతుడి భార్య జయమ్మ, కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ.. చక్రయ్యగౌడ్ హత్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాలుపంచుకున్న వారిపై దర్యాప్తు చేసి శిక్ష పడేలా చూస్తామన్నారు. అదే గ్రామానికి చెందిన కనకటి వెంకన్న భూమి క్రయవిక్రయాల సమయంలో కల్గించే ఇబ్బందులను కూడా బాధితులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. కనకటి వెంకన్న అగాయిత్యాలకు సహకరించే ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుంటామన్నారు. దర్యాప్తులో పోలీసులు అలసత్వం వహిస్తే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని, ఈ విషయమై కొంత మంది పోలీసు అధికారులకు మెమోలు జారీ చేశామని తెలియజేశారు. గ్రామస్తులు శాంతియుతంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ అధికారులను సంప్రదించాలని కోరారు. చక్రయ్యగౌడ్ హత్యలో ప్రధానంగా అల్లుళ్ల కనకటి వెంకన్న, కనకటి ఉప్పలయ్య, కనకటి లింగయ్య ఉన్నారని, వీరికి సహకరించిన మరో 16మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 9మందిని అదుపులోకి తీసుకున్నామని, మిగతా నిందితులను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆయన వెంట సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ రవి, సీఐ శ్రీనివాస్‌నాయక్, నాగభూషణం, రఘువీర్, ఎస్ఐ మహేంద్రనాథ్ ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

సూర్యాపేట టౌన్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి పౌరుడూ సహకరించాలని మల్టీ జోన్ 2 ఐజీ సత్యనారాయణ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లాను సందర్శించిన సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహతో కలిసి పోలీస్ అధికారులతో మాట్లాడారు. పోలీస్ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. సమస్యలు సృష్టించే వారిపై నిఘా ఉంచడంతోపాటు సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం పర్యటించాలన్నారు. అసాంఘిక చర్యల నిరోధం, సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యపరిచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నేటి సమాజంలో ఆధిపత్యం కోసం దాడులు చేసుకోవడం బాధాకరమన్నారు. ఎవరైనా ఇలాంటి దాడులకు పాల్పడితే కఠినమైన జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నందున గ్రామాలు, పట్టణాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలన్నారు. పౌరులు ఎవరు కూడా చట్ట ఉల్లంఘన చర్యలకు పాల్పడకూడదన్నారు. సమస్యలు ఉంటే చట్టపరిధిలో పరిష్కరించుకోవాలని సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం

కోదాడరూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కోదాడ పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్న మాటేటి రంజిత్‌కుమార్(29) మినరల్ వాటర్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడు నెలలుగా వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురికావడంతో వ్యాపారం నిలిచిపోయింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన రంజిత్‌కుమార్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చూసేవరకు అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు అవివాహితుడు. మృతుడి సోదరుడు పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

యువతికి వేధింపులు.. కేసు నమోదు

హుజూర్‌నగర్: యువతిని లోబర్చుకొని ఆమె ఫొటోలు రహస్యంగా చిత్రీకరించి బెదిరించిన వ్యక్తులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌కు చెందిన స్వామి రోజాకు ఓ యువతితో పరిచయం ఉంది. రోజా ద్వారా ఆమె ప్రియుడు నూకతోట్టి ప్రమోద్‌కుమార్ సదరు యువతికి పరిచయమయ్యాడు. ఈ నెల 7వ తేదీన మాట్లాడాలని చెప్పి ఆ యువతిని ప్రమోద్‌కుమార్ లాడ్జీకి తీసుకెళ్లాడు. ఆమెకు మద్యం తాగించి అఘాయిత్యం చేసి రహస్యంగా ఫొటోలు తీశాడు. ఆ తర్వాత ఆ ఫొటోలు బయటపెడతానని సదరు యువతిని ప్రమోద్‌కుమార్ బెదిరించడం మొదలుపెట్టాడు. మంగళవారం ప్రమోద్‌కుమార్, ఎల్. హరీష్, రోజా ముగ్గురు కలిసి యువతిని బలవంతంగా కారులో హుజూర్‌నగర్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ వైపు తీసుకెళ్లారు. అక్కడ ప్రమోద్, హరీష్ కలిసి శారీరకంగా తమతో కలవమని యువతిని బెదిరించారు. లేదంటే ఫొటోలు బయటపెడతామని బెదిరించగా ఆమె ఒప్పుకోలేదు. వారి నుంచి తప్పించుకున్న యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫెన్సింగ్ ధ్వంసం చేసిన వారిపై..

చౌటుప్పల్ రూరల్: వ్యవసాయ భూమి చుట్టూ ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసిన నలుగురిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు బుధవారం చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన జాల మమత తన వ్యవసాయ భూమి చుట్టూ రెండేళ్ల క్రితం కడీలు నాటి ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుంది. మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన పల్చం దీక్షిత్, పల్చం జంగయ్య, పల్చం భాగ్యమ్మ, పల్చం జ్యోతి ట్రాక్టర్‌తో కడీలు విరగ్గొట్టి ఫెన్సింగ్ ధ్వంసం చేశారని మమత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి



సైదులు (ఫైల్)

గరిడేపల్లి: పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లిన వ్యవసాయ కూలీ విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ ఘటన గరిడేపల్లి మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పొనుగోడు గ్రామానికి చెందిన నేలపట్ల సైదులు(32) బుధవారం తాను జీతం ఉంటున్న కటకం గోపయ్య పొలం వద్ద వరి పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. అక్కడ తెగి పడి ఉన్న ఎల్‌టీ లైన్ చూసుకోకపోవడంతో వైరు కాళ్లకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అన్న గురుమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చలిగంటి నరేష్ తెలిపారు.

గోడ దూకుతుండగా..

మిర్యాలగూడ టౌన్: చెట్టు కొమ్మ పట్టుకొని గోడ దూకుతుండగా విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ శివారు జంకుతండా సమీపంలోని ఇండస్ట్రీయల్ ఏరియాకు చెందిన చింతపల్లి పవన్‌కళ్యాణ్(19) బుధవారం తన మిత్రుడు పూజ దుర్గాతో కలిసి ఇండస్ట్రీల్ ఏరియాలోని ఆర్ఎస్ గోదాంలో క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో వారిద్దరు చెట్టు కొమ్మ పట్టుకొని గోడ దూకే ప్రయత్నం చేశారు. దీంతో పక్కనే ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్‌కు చెట్టు తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో పవన్‌కళ్యాణ్ అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన దుర్గా పరిస్థితి విషమంగా ఉండటంతో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

సునీత.. స్ఫూర్తిదాయకం నీ ఘనత



- అంతరిక్షవాసం నుంచి భూమి మీదకు వచ్చిన భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్
- వ్యోమగామిగా ఎన్నో విజయాలు ఆమె సొంతం
- తొమ్మిది నెలల తర్వాత క్షేమంగా తిరిగి రావడంతో అంతటా సంబరాలు

అంతరిక్ష యాత్రలో ఎంతో ధైర్యం ప్రదర్శించిన సునీత విలియమ్స్ నేటి యువతకు ఆదర్శం. గతేడాది సెప్టెంబర్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కు వెళ్లిన ఆమె తొమ్మిది నెలల అనంతరం తిరిగి బుధవారం తెల్లవారుజామున భూమి మీదకు వచ్చింది. అంతరిక్ష ప్రయాణాల శాస్త్రీయ పురోగతి కోసం ఎన్నో పరిశోధనలు చేసిన ఆమె భారతీయ సంతతికి చెందిన వారు కావడంతో యావత్ దేశం జేజేలు పలుకుతోంది. ఐఎస్ఎస్‌కు వెళ్లి క్షేమంగా తిరిగి వచ్చిన సునీతపై పలువురి ప్రముఖుల అభిప్రాయాలు.

– నల్లగొండ టూటౌన్, సూర్యాపేట టౌన్

ఖగోళ పరిశోధకురాలిగా సాధించిన విజయం



ఒక భారతీయ అమెరికన్ వ్యోమగామిగా సునీత విలియమ్స్ ఖగోళ పరిశోధకురాలిగా 195 రోజుల 15 గంటల 40 నిమిషాల్లో సాధించిన విజయమిది. తన అంతరిక్ష ప్రయాణం శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగ్ గణిత రంగాల్లో ఉన్నవారికి ప్రేరణ కలిగిస్తుంది. ఆమె వారసత్వం భవిష్యత్ తరాలకు గొప్ప మార్గదర్శకంగా నిలువనుంది.

– సీహెచ్. రమేష్, పీజీ సెక్షన్ కోఆర్డినేటర్, ఎంజీయూ

ఆమె విజయాలు ఎందరికో స్ఫూర్తి



సునీత విలియమ్స్ అంతరిక్ష యాత్ర నుంచి క్షేమంగా తిరిగి రావడం చాలా సంతోషంగా ఉంది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సైన్స్ గురించి తెలుసుకోవాలనే ఆమె పట్టుదల ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిచ్చింది. భవిష్యత్‌లో శాస్త్రవేత్తలు కావాలనుకునే వారికి సునీతా విలియమ్స్ సాధించిన విజయాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి.

– డాక్టర్ ఎస్. భిక్షమయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎంజీయూ

అంతరిక్ష యాత్రలు.. ఆమెకే సొంతం



వ్యోమనౌకలో సాంకేతిక లోపంతో తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలో చిక్కుకున్న సునీత విలియమ్స్ ఎట్టకేలకు భూమిని చేరడం అద్భుత ఘట్టం. అంతరిక్ష విజయాలు ఆమెకే సొంతం. తన ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా ఆత్మవిశ్వాసంతో అంతరిక్షంలో పరిశోధనలు చేసి తిరిగి రావడం విజయానికి ప్రతీక.

– ఎస్. ఆదిరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎంజీయూ

భారతదేశానికే గర్వకారణం



సునీత విలియమ్స్ అన్ని అడ్డంకులను అధిగమించి భూమి పైకి తిరిగిరావడం భారతదేశానికి గర్వకారణం. ఆమె అంతరిక్ష విజయాలు భారత సంస్కృతి పట్ల ఆమెకున్న అనుబంధాన్ని తెలియజేస్తాయి. గణేష్ విగ్రహాన్ని సైతం ఆమె అంతరిక్షానికి తీసుకెళ్లడం భారతీయులకు ఆనందాన్ని ఇచ్చింది.

– డాక్టర్ కె. సత్తిరెడ్డి, ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్, ఎంజీయూ

భావి భారత శాస్త్రవేత్తలకు ఆదర్శం



తొమ్మిది నెలలుగా అంతరిక్షంలో చిక్కుకుని భూమి మీదికి తిరిగి వచ్చిన సునీత విలియమ్స్ భావిభారత శాస్త్రవేత్తలకు ఎంతో ఆదర్శం. అంతరిక్ష పరిశోధన పైన ఆసక్తి కలిగినటువంటి మహిళలకు ఆమె సాహసం ఎంతో స్ఫూర్తినిస్తుంది.

– అంకతి వెంకన్న, ఫిజిక్స్ టీచర్, ఉన్నత పాఠశాల, సూర్యాపేట

ఎంతో గర్వంగా ఉంది



సునీత విలియమ్స్ భారత సంతతికి చెందిన మహిళ కావడం గర్వంగా ఉంది. ఒక మహిళ 286 రోజులు అంతరిక్షంలో గడపడం అసాధారణం. ఆమె మహిళలందరికీ గర్వకారణం. ఆమె త్వరగా కోలుకొని మామూలు స్థితికి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఆమె భవిష్యత్తులో వ్యోమగామి కావాలనుకునే వారికి ఆదర్శంగా నిలిచారు.

– ఎం. శ్రీనివాస్‌రెడ్డి, ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్

ఆమె ప్రయాణం చరిత్రలో నిలిచిపోతుంది



సునీత విలియమ్స్ అంతరిక్షం ప్రయాణం చరిత్రలో నిలిచిపోతుంది. సుదీర్ఘ కాలం పాటు అంతరిక్షంలో ఆమె చేసిన పరిశోధనలు మానవ జాతికి ఎంతో మేలు చేస్తాయనడంలో సందేహం లేదు. ఆమె భూమి పైకి తిరిగి రావడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ చేసిన కృషి ప్రశంసనీయం.

– సుదర్శన్‌రెడ్డి, ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్

విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి



అంతరిక్ష నౌకలో సాంకేతిక సమస్యల కారణంగా తొమ్మిది నెలల పాటు స్పేస్‌లో ఉండిపోయినా చెదరని ఆత్మవిశ్వాసంతో సునీత విలియమ్స్ తిరిగి భూమి మీదకు రావడం గొప్ప విజయాన్నే భావించాలి. అంతరిక్ష పరిశోధకురాలిగా సునీత విలియమ్స్ సాధించిన విజయాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి.

– వీరస్వామి, ప్రొఫెసర్, ఎంజీయూ

సునిత విలియమ్స్ తిరుగులేని మహిళ



అంతరిక్ష వాసం నుంచి సునీత విలియమ్స్ తిరిగి రావడం గొప్ప విజయం. రష్యా వ్యోమగామి పాలికోవ్ 437 రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో అంతరిక్షంలో తిరగగా, సునీత మాత్రం ఒకే చోట తొమ్మిది నెలలు ఉండి పరిశోధనలు చేసి తిరుగులేని మహిళా వ్యోమగామిగా ఖ్యాతిగడించింది. యువత సునీత విలియమ్స్ స్ఫూర్తితో ముందడుగు వేయాలి.

– ఖాజా అల్తాఫ్ హుస్సేన్, వైస్ చాన్స్‌లర్, ఎంజీయూ

ఎంజీ యూనివర్సిటీలో సంబరాలు



అంతరిక్షం నుంచి సునీత విలియమ్స్ తిరిగొచ్చిన సందర్భంగా బుధవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఫిజిక్స్ విభాగం విద్యార్థులు అధ్యాపకులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంజీయూ ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. – నల్లగొండ టూటౌన్

శాస్త్రీయ పద్ధతుల్లో పశుగ్రాసం సాగు భేష్



పశుగ్రాసం సాగు విధానం

పెద్దవూర: పశుగ్రాసం అంటే రైతులకు గుర్తుకొచ్చేది జొన్న, వరి, సజ్జ తదితర తృణధాన్యాలు. వీటిలో పశువులకు కావాల్సిన పోషకాలు లభించవు. పైగా వీటికి ఖర్చు అధికం. శాస్త్రీయ పద్ధతిలో నాణ్యమైన పశుగ్రాసం అందిస్తే పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చు. పశుగ్రాసం సాగు ఖర్చు తగ్గించవచ్చు. డెయిరీ ఫాంల నిర్వహణ వ్యయంలో 70శాతం వరకు పశువుల మేతకే సరిపోతుంది. అందువల్ల మేత ఖర్చును తగ్గిస్తే అంత మేరకు లాభాలు పెంచుకునే అవకాశం ఉంది. అలాగే పాలశీతలీకరణ అధికారులు పాలు సప్లయ్ చేసే రైతులకు 50 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు అందిస్తారు. పశుసంవర్థక అధికారులు సైతం 50శాతం రాయితీపై విత్తనాలు ఇవ్వనున్నారు. పశువుల కాపరులు వీటిని సద్వినియోగం చేసుకుని పశుగ్రాసం సాగు చేస్తే గడ్డి కొరత తీరుతుందని పెద్దవూర మండల పశువైద్యాధికారి డాక్టర్ నులక నాగార్జున్‌రెడ్డి సూచించారు.

- పశుగ్రాసం విత్తనాల్లో ప్రధానమైనవి సూపర్ నైపర్, కో–1, కో–2, ఎస్ఎస్‌జీ–825 రకాలు.
- 85శాతం వరకు పచ్చిమేతను ఈ రకాల ద్వారా తీర్చుకోవచ్చు.
- ఒకసారి నాటితే నాలుగు నుంచి ఐదు సంవత్సరాల వరకు దిగుబడులు పొందవచ్చు.
- జనవరి నుంచి ఆగస్టు నెల వరకు ఈ పశుగ్రాసం విత్తనాలు విత్తుకోవచ్చు.
- అన్నిరకాల నేలల్లో సాగు చేసుకోవచ్చును. ఆమ్ల గుణాలు గల నేలల్లో అధిక దిగుబడి ఉంటుంది.
- పశుగ్రాసాల సాగుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించలేని వారు తోటలు, కూరగాయ పంటల్లో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు.
- ఎకరాకు 16 నుంచి 20 కిలోల విత్తనం అవసరం. మిశ్రమ పంటగా కూడా సాగు చేసుకోవచ్చు.
- దుక్కిలో 4 నుంచి 5 టన్నుల కంపోస్టు ఎరువు, 22 కిలోల యూరియా, 16 నుంచి 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.
- విత్తిన 45 రోజుల తర్వాత ఎకరాకు 22 కిలోల యూరియా వేయాలి. ఎకరానికి 20 టన్నుల దిగుబడి వస్తుంది.
- అధిక విస్తీర్ణంలో సాగుచేసి సైలే జీ లేదా ఎండుగడ్డి రూపంలో నిల్వ చేసి వాడుకోవచ్చు.

పాల దిగుబడి ఎక్కువే

పశుగ్రాసాల సాగుకు తక్కువ శ్రమ, పెట్టుబడి అవసరం అవుతుంది. విత్తనాలు నాటిన కొద్ది రోజుల్లోనే పశుగ్రాసం కోతకు వస్తుంది. పచ్చి మేత రుచికరంగా ఉండటం వలన పశువులు ఇష్టంగా తింటాయి. సులభంగా జీర్ణం చేసుకుంటాయి. పచ్చి మేత వలన పాల దిగుబడులు 25శాతం వరకు పెరుగుతుంది. పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. దాణా అవసరం లేకుండా కేవలం పచ్చి మేత ద్వారా 5 నుంచి 6 లీటర్ల పాల దిగుబడి సాధించవచ్చు. పచ్చి మేతలో కాల్షియం, భాస్వరం వంటి మాంసకృత్తులతో పాటు ఏ, డీ, ఈ విటమిన్లు, పిండి, కొవ్వు పదార్థాలు అధికంగా ఉంటాయి. నీరు తక్కువగా ఉన్న ప్రాంతాల్లోనూ పశుగ్రాసాలను సాగు చేసుకోవచ్చు.

లారీ ఢీ.. వృద్ధుడికి గాయాలు

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ శివారులో 65వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం లారీ ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులోని శ్రీరామలింగేశ్వర స్వామి గుట్ట వద్ద జాతీయ రహదారిపై నుంచి ఓ గుర్తుతెలియని వృద్ధుడు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఇదే సమయంలో చిట్యాల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. వృద్ధుడికి తీవ్ర గాయాలుకాగా చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

జూదరులపై కేసు నమోదు

మునగాల: పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మునగాల మండలం బరాఖత్‌గూడేనికి చెందిన నూకమళ్ల ముత్తయ్య ఇంటి ఆవరణలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేయగా.. ముగ్గురు పరారయ్యారు. షేక్ లాలును అదుపులోకి తీసుకున్నారు. అతడితో పాటు ముక్కారవు అంకారావు, నూకమళ్ల సుందరయ్య, కొమ్ము వీరబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.4వేల నగదు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు నల్లగొండకు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం నల్లగొండకు రానున్నారు. మంత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 11 గంటలకు నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12.30కు రామగిరిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తారు. ఆ తర్వాత నల్లగొండలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ బయల్దేరి వెళతారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి



నాగారంలో మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నాగారం: పంటలు ఎండిన రైతులకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ డిమాండ్ చేశారు. గురువారం నాగారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండిన వరిపొలాలను పరిశీలించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వ్యవసాయాన్ని నమ్ముకొని రూ.వేలకు వేలు పెట్టుబడులు పెట్టి వరి సాగు చేసిన రైతులు సాగు నీరు అందక వేలాది ఎకరాల వరి పంట ఎండిపోయాయన్నారు. ఎండిన వరికి ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లిచకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపేట కాశయ్య, భయం లింగయ్య, సంపేట కృష్ణమూర్తి, కాసం వీరయ్య, సత్తయ్య, పెరమళ్ల సత్తయ్య, జాని, నాతి బాలరాజు, బచ్చు విజయ్, సంపేట రాకేష్, కాసం పవన్, కదారి సోమయ్య, రమేష్, సతీష్ పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

● సూర్యాపేట ఎస్పీ నరసింహ



సూర్యాపేట టౌన్: జిల్లాలో ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4వరకు జరిగే పదో తరగతి పరీక్షల నేపథ్యంలో కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) సెక్షన్ 163 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ కె. నరసింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 11,912 విద్యార్థుల కోసం ఏర్పాటు చేసే 67 పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండకూడదని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు వెల్లడించారు. విద్యార్థులు పరీక్షలకు కంగారుగా వెళ్లొద్దని, సమయానికి బయలుదేరాలని, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం టిక్యాతండా శివారులో మూతపడి ఉన్న తవుడు మిల్లులో చోరీకి పాల్పడిన వ్యక్తిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17వ తేదీ రాత్రి టిక్యాతండా శివారులో మూతపడి ఉన్న తవుడు మిల్లు తాళాలు పగులకొట్టి అందులో నిల్వ ఉన్న అల్యూమినియంను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మిల్లు యాజమాని మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా టిక్యాతండాకు చెందిన ధరావత్ నిఖిల్ బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా తానే చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని మిర్యాలగూడ కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

తెలంగాణ రైతాంగాన్ని కాపాడాలి

● మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



పెద్దవూర: మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

పెద్దవూర: కృష్ణా నీటి వాటాలో హక్కులను సాధించి తెలంగాణ రైతాంగాన్ని కాపాడాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన పెద్దవూర మండలంలోని పర్వేదుల గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు పల్లా మోహన్‌రెడ్డి అంత్యక్రియలకు హాజరై విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో చరిత్రలో ఎప్పుడూ పండని పొలాలకు సాగునీరు ఇచ్చామన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత పరిస్థితి తారుమారైందని పేర్కొన్నారు. కృష్ణాలో మన హక్కులు లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ సీఎం అయ్యాక కృష్ణా నదిలో మన వాటా నీళ్లు మనకు వచ్చిన తర్వాతనే ఏపీకి ఇచ్చామని, చుక్కనీరు కూడా అదనంగా పోనివ్వలేదన్నారు. ఈ యేడాది కృష్ణా నీటిని ఏపీ అక్రమంగా తరలిస్తున్నా.. అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో 2014కు పూర్వం పరిస్థితి రాబోతుందని.. ఎడమ కాల్వ, వరద కాల్వ పరిధిలోని రైతులు చైతన్యం కావాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు నోముల భరత్, నలమోతు భాస్కర్‌రావు, నాయకులు జటావత్ రవినాయక్, మేరెడ్డి జైపాల్‌రెడ్డి, చెన్ను సుందర్‌రెడ్డి, అల్లి పెద్దిరాజు, దేవసాని శ్రీనివాస్‌రెడ్డి, నడ్డి లింగయ్య, దండా ఎల్లారెడ్డి, పుల్లారెడ్డి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చింది

కొండమల్లేపల్లి: మోసపూరిత హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏడాది కాలంలోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక్క పిల్లర్ కూలితే దానిని రిపేర్ చేయించి రైతులకు నీళ్లు ఇవ్వాల్సింది పోయి కేసీఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందోనని సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు నీళ్లు ఇవ్వక పోవడంతో పొలాలు ఎండిపోతున్నాయన్నారు. పంటలు ఎండకుండా 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కేసాని లింగారెడ్డి, రమావత్ దస్రునాయక్, తులసీరాం, పెద్దిశెట్టి సత్యం, రావుల వెంకటయ్య, తోటపల్లి శ్రీను, వరికుప్పల పాండు, ముడిగె శేఖర్, దాచేపల్లి నరేందర్, పేట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉండ్రుగొండ బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల(సూర్యాపేట): మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామ శివారులో గల గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ ఆరుట్ల రవికుమారచార్యులు, శ్రీమాన్ అరవిందచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రుణ విమోచన నారసంహిత మహాయాగం, పూర్ణాహుతి, చక్రస్నానం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీతోపాటు, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం కృష్ణకుమార్, బంధకవి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆర్ఎం జానిరెడ్డి, డిపో సిబ్బంది

దేవరకొండ: ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండ డిపోను ఆయన సందర్శించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాల బుకింగ్స్‌కు సంబంధించిన కరపత్రాలను దేవరకొండ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబుతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న కార్గో పార్సిల్ సర్వీస్ ద్వారా రూ.151చెల్లిస్తే కల్యాణం తలంబ్రాలను ఇంటి వద్దకే అందజేయనున్నట్లు తెలిపారు. కార్గో పార్సిల్ సర్వీస్‌తో పాటు ఆన్‌లైన్‌లో కూడా తలంబ్రాలు బుక్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. వివరాలకు సెల్‌నంబర్ 9151298694ను సంప్రదించాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు, కార్మికులు సమష్టిగా కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం పడాల సైదులు, డిపో సిబ్బంది ఉన్నారు.

వర్గీకరణ వద్దు.. రాజ్యాధికారమే ముద్దు



మిర్యాలగూడలో జరిగిన మాలల ఆత్మ గౌరవ సభలో మాల నేతలు

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి

మిర్యాలగూడ టౌన్ : ఎస్సీ వర్గీకరణ వద్దు.. రాజ్యాధికారమే ముద్దు అంటూ దళితులంతా ఆ దిశగా పోరాడాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి అన్నారు. బుధవారం మిర్యాలగూలో నిర్వహించిన మాలల ఆత్మగౌరవ సభలో ఆయన మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ముండ్లగిరి కాంతయ్య, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు గుండాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. తెలంగాణలో మాల, మాదిగల జనాభా లెక్కలు తీసి దాని ప్రకారం మాలలకు 15 శాతం నుంచి 25 శాతం వరకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. 'కాంగ్రెస్ అంతం.. మాలల పంతం' పేరుతో గ్రామ స్థాయి నుంచి మాలలను చైతన్యం చేస్తామన్నారు. రానున్న కాలంలో మాలల వ్యతిరేక శక్తులకు తగిన బుద్ధి బెబుతామన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు లక్ష్మణ్, బొప్పని నగేష్, గాజుల పున్నమ్మ, పి.ధనమ్మ, డాక్టర్ ఏకుల రాజారావు, కోడిరెక్క శౌరి, లింగయ్య, విజయ్, జాకబ్ ప్రతాప్, చిరంజీవి, జోజికుమార్, మట్టయ్య, శేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

భానుపురి (సూర్యాపేట): రేషన్ కార్డుదారులకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సివిల్ సప్లయ్ అధికారులు, హుజూర్‌నగర్ డివిజన్‌లోని 7 మండలాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మూడు నెలలకు ఒక్కసారి రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహిస్తామని, అప్పుడు వారి సమస్యలను తెలియజేస్తే ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తామన్నారు. రేషన్ డీలర్లు అవకతవకలకి పాల్పడితే డీలర్ షిప్ రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎస్ఓ రాజేశ్వర్, డీఎం ప్రసాద్, ఏసీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, రేషన్ డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్ పి.రాంబాబు తెలిపారు. బుధవారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, సంబంధిత శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉదయం 8 గంటలలోపే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఈఓ అశోక్ కుమార్, డీఎంహెచ్ఓ కోటాచలం, డీపీఓ యాదయ్య ఉన్నారు.

యువత.. డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు



తిరుమలగిరి సంతలో కరపత్రాలు పంచుతున్న ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్

● సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఉపాధ్యాయుడి వినూత్న ప్రచారం

తిరుమలగిరి(తుంగతుర్తి): మద్యపానం, ధూమపానం, మాదకద్రవ్యాలు వాడడం ఆరోగ్యానికి హానికరమంటూ వినూత్న రీతిలో ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. డ్రగ్స్ వద్దు.. ప్రాణమే ముద్దు(నో డ్రగ్స్- సేవ్ లైఫ్) నినాదంతో పుర్రె, ఎముకల గూడు చిత్రాలు కలిగిన నల్ల దుస్తులు ధరించి మైక్ సెట్ పట్టుకుని వివిధ ఉత్సవాలు, పండుగలు, వార సంతలు, ఊరేగింపులు, రద్దీగా ఉన్న ప్రదేశాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తూ ప్రజలు, యువతను మేల్కొల్పుతున్నారు. ఆయనే సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్. బుధవారం ఆయన తిరుమలగిరిలో జరిగిన సంతలో కరపత్రాలు పంచి యువకులందరికీ డ్రగ్స్, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా యువతను సన్మార్గంలో నడిపించేందుకు తనవంతుగా ఈ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. బావిభారత నిర్మాణానికి ఉపయోగపడాల్సిన యువత పెడదారి పట్టకుండా వారిలో చైతన్యం తీసుకురావడానికే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని పేర్కొన్నారు.

సందేహాలుంటే ఫిర్యాదు చేయాలి

● కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

భానుపురి (సూర్యాపేట) : ఫామ్-6,7,8 లపై ఏమైనా సందేహాలుంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కోరారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి. రాంబాబు తో కలిసి అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బూత్ స్థాయి లో అన్ని పార్టీల ఏజెంట్ల జాబితాను త్వరగా అందజేయాలన్నారు. జిల్లాలో 2024నవంబర్ 29 నుంచి నేటి వరకు కొత్త ఓటు కోసం ఫామ్-6 లు 4,707 స్వీకరించగా వీటిలో 2,927 అంగీకరించి 958 తిరస్కరించినట్లు వివరించారు. మిగిలిన 822 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు చకిలం రాజేశ్వరరావు, హబీబ్, సత్యనారాయణ, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డీటీ వేణు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి ఆలయంలో కలెక్టర్ పూజలు



కలెక్టర్, కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న ధర్మకర్తలు, అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ కుటుంబ సమేతంగా శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శేషవస్త్రాలు, మెమెంటోతో ఘనంగా సత్కరించి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టతను ధర్మకర్తలు, అర్చకులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, మట్టపల్లిరావు, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, సీఐ గజ్జె చరమందరాజు, మఠంపల్లి తహసీల్దార్ ఎల్. మంగా, ఆలయ ఈఓ సిరికొండ నవీన్‌కుమార్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మ నాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

పంటలు ఎండిన రైతాంగాన్ని ఆదుకోవాలి



నార్కట్‌పల్లి : ఎండిన వరిపొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, నాయకులు

నార్కట్‌పల్లి: వరిపొలాలు ఎండి తీవ్రంగా నష్టపోయిన జిల్లా రైతాంగానికి ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మాని, జువ్విగూడెం, చిన్న తుమ్మలగూడెం గ్రామాల్లో ఎండిన వరి పొలాలను బుధవారం ఆయన బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఎన్ని ఎకరాల్లో పంట నష్టపోయారని ఆయా గ్రామాల రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పొలాలు ఎండిపోయాయన్నారు. ఆయన వెంట నాయకులు దుబ్బాక శ్రీధర్, రాజిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అనంతరెడ్డి, ఎల్లేష్, నరేష్, వెంకట్ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నేరేడుచర్ల: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న సంఘటన బుధవారం తెల్లవారు జామున నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెంలో చోటుచేసుకుంది. నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాలు.. నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం వాహనంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దాచేపల్లికి తరలిస్తుండగా సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. వాహనంలో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుడినట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి పిండిపోలు పర్వతాలు, పాలకీర్తి రమణలను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మరో ఇద్దరు పరారీ అయినట్లు తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

నైలీ పరిశ్రమ ఎదుట కార్మికుల నిరసన

చౌటుప్పల్ రూరల్: మండలంలోని పంతంగి గ్రామ పరిధిలోని నైలీ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో 25 ఏళ్లుగా పనిచేసిన కార్మికుడిని అకారణంగా విధుల నుంచి తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం ఆ పరిశ్రమ ఎదుట బుధవారం కార్మికులు నిరసన తెలిపారు. నిరసనకు పంతంగి గ్రామ మాజీ సర్పంచ్ బాతరాజు సత్యం, కాంగ్రెస్ నాయకులు బోయ యాదయ్య, బోయ అంబేద్కర్, బీజేపీ నాయకులు దూడల భిక్షం, సప్పిడి లింగారెడ్డి మద్దతు ప్రకటించి కార్మికులతో బైటాయించి ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ పరిశ్రమ వద్దకు వచ్చి కార్మికుల సమస్యను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ ఇన్‌చార్జి హేమంత్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్మికుడిని విధుల్లోకి తీసుకునేంత వరకు ఊరుకోబోమని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

పంట కాలువలోకి వ్యర్థ రసాయనాలు!

- కలుషితమవుతున్న కొత్తగూడెం మేజర్
- కోదాడ పరిధిలోని ఫ్యాక్టరీ నుంచి పైప్‌లైన్ ద్వారా విడుదల
- విషంగా మారుతున్న భూగర్భ జలాలు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న రైతులు
- వ్యర్థ రసాయనాలు వదలకుండా చూడాలని వేడుకోలు



కాలువలోకి వ్యర్థ రసాయనాలు విడుదల చేసేందుకు ఏర్పాటు చేసిన పైపు



వ్యర్థాలు కలవడంతో కాలువలో నలుపు రంగులోకి మారిన నీళ్లు

అనంతగిరి: మండలంలోని కొత్తగూడెం మేజర్ కాలువ.. వ్యర్థ రసాయనాలతో కలుషితమవుతోంది. పక్కనే ఉన్న కోదాడ మండల పరిధిలోని ఓ పేపర్ ఫ్యాక్టరీ నుంచి వ్యర్థ రసాయనాలను పైప్‌లైన్ ద్వారా యథేచ్ఛగా ఈ పంట కాల్వలోకి విడుదల చేస్తున్నారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా కాలువలోకి వ్యర్థ రసాయనాలు వదులుతుండడంతో ఈ కాలువలో సుమారు కిలోమీటర్ పొడవునా దుర్వాసన వస్తుండడంతో పరిసర ప్రాంతాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా తాము అనారోగ్యం బారిపడుతున్నా ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.

కొన్నేళ్ల నుంచి విడుదల చేస్తున్నా..

కొన్నేళ్లుగా ఫ్యాక్టరీ నుంచి రసాయన వ్యర్థాలను పంట కాలువలోకి విడుదల చేస్తుండడంతో తమ పంటపొలాలు కలుషితమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. పరిసరాల్లో నీటి కోసం వ్యవసాయ బావులను తవ్వినా ఆ నీరు కూడా దుర్వాసన వస్తుందని, ఆ నీటితో కాళ్లు, చేతులు కడుక్కున్నా దురద పెడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన, దురద కారణంగా పొలాల్లో పని చేసేందుకు కూడా కూలీలు రావడం లేదంటున్నారు. భవిష్యత్తులో భూగర్భజలాలు మరింత విషతుల్యంగా మారే ప్రమాదం ఉందని, వెంటనే సంబంధిత ఫ్యాక్టరీ నుంచి రసాయన వ్యర్థాలు కాలువలోకి విడుదల చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



పొలాలకు వెళ్లే కాలువలో పారుతున్న వ్యర్థ రసాయనాలు

కలుషిత నీటితో పంటలపై ప్రభావం

కలుషిత నీటితో సాగు చేసిన పంటలపైనా తీవ్ర ప్రభావం పడుతుంది. అలా పండిన పంటను తిన్నా అనారోగ్యం బారిన పడతాం. ఇక్కడి భూగర్భ జలాలను మిర్యాలగూడలో వాటర్ టెస్టింగ్ ల్యాబ్‌లో పరీక్షించేందుకు స్థానిక వ్యవసాయ అధికారులను పంపిస్తాం.

– యల్లయ్య, ఏడీఏ, కోదాడ

అధికారులను పంపించి పరిశీలిస్తాం

కొత్తగూడెం మేజర్ కాలువలో పారుతున్న నీటిని పరిశీలించేందుకు అధికారులను పంపిస్తాం. ఈ ఫ్యాక్టరీకి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. ఇందుకు సంబంధించి ఫ్యాక్టరీ యాజమాన్యానికి నోటీసులు పంపిస్తాం.

–సువర్ణ రేఖ, ఇరిగేషన్ డీఈ

ఎండ నుంచి రక్షణకు..

రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో మనుషులు, పశుపక్షాదులు కూడా తట్టుకోలేకపోతున్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ చికెన్ షాపు యజమాని కోళ్లను ఎండ వేడి నుంచి కాపాడేందుకు బస్తాలు కట్టి వాటికి గంట గంటకు నీరు కొడుతున్నాడు.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్-నల్లగొండ

